గళం విప్పుతారా..?

- జిల్లాను వెంటాడుతున్న సమస్యలు
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడటం లేదు. దీంతో కరవు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. సోమవారం నుంచి ఎపి శాసనసభ సమావేశాలు మొదలుకానున్నాయి. జిల్లా నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా వారిలో ఒక మంత్రి కూడా ఉన్నారు. జిల్లాలోని సమస్యలపై వారు గళం విప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు : కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసల్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్ర : జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగు నీటికి తిప్పలే : ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్సి, హెచ్ఎల్సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హోళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత : కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్

- డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా
- ప్రజాశక్తితో విద్యుత్ ఎస్ఈ ఎం.ఉమాపతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వేసవిలో కోతలు లేకుండా అంతరాయం లేకుండా విద్యుత్తును అందిస్తామని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తును సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో విద్యుత్ శాఖలో ఎంత మంది పనిచేస్తున్నారు?

ఎస్ఈ : కర్నూలు జిల్లాలో 127 సబ్ స్టేషన్లు ఉన్నాయి. విద్యుత్ శాఖలో మొత్తం 1373 మంది పర్మనెంట్ ఉద్యోగులు, అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కింద 1504 మంది పనిచేస్తున్నారు.

కర్నూలు జిల్లాలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి?

ఎస్ఈ : కర్నూలు జిల్లాలో 9,30,000 కనెక్షన్లు ఉన్నాయి. అందులో గృహవినియోగ కనెక్షన్లు 7, 07,000, కమర్షియల్ కనెక్షన్లు 96000, పరిశ్రమల కనెక్షన్లు 3500, వ్యవసాయ కనెక్షన్లు 1,00,000, విద్యుత్ దీపాలు, ప్రభుత్వ కార్యాలయ కనెక్షన్లు 1200 ఉన్నాయి.

స్మార్ట్ మీటర్లు ఎన్ని పెట్టారు?

ఎస్ఈ : 200 యూనిట్లకు పైగా వారికి 40 వేల వరకు స్మార్ట్ మీటర్లు పెట్టాము. వ్యవసాయ కనెక్షన్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఉండవు.

2024-25 సంవత్సరానికి గాను వ్యవసాయ కనెక్షన్లకు ఎన్నిటికి డబ్బులు కట్టారు?

ఎస్ఈ : 2024 - 25 సంవత్సరానికి గాను 3063 కనెక్షన్లు కావాలని డబ్బులు కట్టారు. కనెక్షన్లకు కావాల్సిన మెటీరియల్ అందుబాటులో లేక అక్టోబర్ 2023 నుండి 7500 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 - 25 సంవత్సరానికి గాను కనెక్షన్లు ఉండి అదనపు విద్యుత్తును వాడిన 700 మందికి ఎనిమిది లక్షల 50 వేల రూపాయలు, దొంగ కరెంటు వాడుకున్న వారికి రూ.19 లక్షలు జరిమానా విధించాం.

శిథిలావస్థకు చేరిన పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఎప్పుడు పెడుతున్నారు?

ఎస్ఈ : కర్నూల్ నగరంలోని పాతబస్తీలో ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకు 250 స్తంభాలను మార్చాం. మార్చి చివరి నాటికి అన్ని మార్చేస్తాం. అలాగే ఇండ్లకు దగ్గరగా విద్యుత్ తీగలు ఉంటూ వేలాడుతున్న వాటి స్థానంలో 25 కిలోమీటర్ల కేబుల్ వైర్‌ను మార్చాము.

విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే ఎన్ని రోజుల్లో మారుస్తున్నారు?

ఎస్ఈ : విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే పట్టణంలో 24 గంటలు, పల్లెల్లో 48 గంటల్లో పాత వాటిని తొలగించి కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

స్మార్ట్ మీటర్లు వద్దని ఇఆర్‌సికి ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు?

ఎస్ఈ : స్మార్ట్ మీటర్లు వద్దని వినియోగదారుల నుండి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. కేవలం 50 మంది వివిధ సంఘాల ప్రతినిధుల నుండి అభ్యంతరాలు వచ్చాయి. అందులో ప్రధానంగా ప్రీపెయిడ్ వద్దు. పోస్ట్ పెయిడ్ ఉండాలని కోరారు.

సోలార్ విద్యుత్ కనెక్షన్లు జిల్లాలో ఎన్ని ఉన్నాయి? వాటి వల్ల ఉపయోగం ఏమి?

ఎస్ఈ : సోలార్ విద్యుత్ కనెక్షన్లు జిల్లాలో 320 ఉన్నాయి. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులకు మాత్రమే ఈ కనెక్షన్లు ఇస్తారు. రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని. విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కనెక్షన్లు తీసుకున్నటువంటి వారికి ఇంటి పైకప్పు పై కనీసం 10 చదరపు మీటర్లు/100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకులో రుణాలు అందిస్తాయి. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేయచ్చు. విద్యుత్ అధికారులు వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు ఎలాంటి సమస్య ఉన్న తమ పరిధిలో వెంటనే పరిష్కరించే దిశగా అప్రమత్తంగా ఉంటూ మంచి సేవలను అందిస్తున్నారు. గతంలో లాగా విద్యుత్ చెల్లింపు కేంద్రాల వద్ద వేచి ఉండి చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆన్లైన్ ద్వారా చెల్లించవచ్చు. గూగుల్ పే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని మొబైల్ యాప్ ద్వారా బిల్లులు ఇంటి వద్ద నుండి చెల్లించే సౌకర్యం కూడా ఉంది. వినియోగదారులు కాలానుగుణంగా వచ్చే మార్పులను అనుసరిస్తూ తమ సమయాన్ని ఆదా చేసుకోవాలి. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి పాటుపడాలి.

పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని 30 కేంద్రాలలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డు సెయింట్ జోసెఫ్ కాలేజీలో నిర్వహిస్తున్న ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్షల తీరును జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పరిశీలించారు. ఎ క్యాంప్ మాంటిస్సోరి స్కూల్ , ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రూపు-2 పరీక్షల తీరును జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి 12:30 గంటల వరకు,గ్రూప్-2 పరీక్షలు, పేపర్ -2 మధ్యాహ్నం 3.00 గంటల నుండి 5 .30 గంటల వరకు నిర్వహించామన్నారు. జిల్లాలో 30 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించామన్నారు. ఉదయం జరిగిన గ్రూప్- 2 పరీక్షలు పేపర్ -1 పరీక్షకు 9993 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, 8693 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మధ్యాహ్నం 3.00 నుండి 5 .30 వరకు పేపర్ -2 పరీక్షలకు 9993 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 8678 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు. పేపర్ -1 పరీక్షకు 86.99 శాతం అభ్యర్థులు, పేపర్-2 పరీక్షలకు 86.84.శాతం అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా, ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని తెలిపారు.

హమాలీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- కొత్త కూలిరేట్ల జిఒను వెంటనే విడుదల చేయాలి
- సివిల్ సప్లయ్ హమాలి యూనియన్

ప్రజాశక్తి-గూడూరు

సివిల్ సప్లయ్ హమాలీల కూలిరేట్లకు సంబంధించిన కొత్త జిఒను విడుదల చేయాలని హమాలీ కార్మికులు గూడూరు ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, కృప అధ్యక్షతన మూడోరోజు నిరసనగా హమాలి కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడుతూ జిఒను చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయ్ హమాలి కార్మికుల కడుపు కొడుతుందని అన్నారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. 2024 జనవరి నుండి దాదాపు 13 నెలలుగా పెంచిన కూలి రేట్లు రూ 25 నుండి 28 రూ సంబంధించిన జిఒను విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. సివిల్ సప్లయ్‌హమాలి కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అనేక సంవత్సరాలుగా హమాలీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాలకు కోరుతున్న ఏ ప్రభుత్వం కూడా వారిని గుర్తించకుండా నిర్లక్ష్య ధోరణిలో వివరిస్తున్నాయని, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం లేకపోవడంతో అమాలి కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రైవేట్ హాస్పటల్‌కు వేలకు వేలు ఖర్చు చేసుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కోర్టులో ఉన్న ఇఎస్ఐ కేసును రాష్ట్ర ప్రభుత్వం కొట్టి వేయించి ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, బోనస్ , కుట్టుకూలీతో కలిపి పెంచి ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ నాయకులు రాజశేఖర్, మధు, భూత రామాంజనేయులు, దనమన్న, సురేష్, గోపి, కొమ్మురాజు,అంజి, మల్లికార్జున, చిన్న రాజు, రంగన్న, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న హమాలీ కార్మికులు

గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

- క్లస్టర్ల వారీగా గట్టిబందోబస్తు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎపిపిఎస్‌సి గ్రూప్- 2 పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదివారం సందర్శించి, పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్‌పి కర్నూలు నగరంలోని కర్నూలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ కళాశాలను పరిశీలించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ.... పరీక్ష కేంద్రాలలో క్లస్టర్ల వారీగా పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్ ప్రాక్టీస్ వంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష పూర్తయ్యేవరకూ అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించామన్నారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గ్రూప్ 2 పరీక్షలు ఉన్నాయన్నారు. జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ , సిఐలు తేజమూర్తి, కేశవ రెడ్డి, నాగరాజారావు, పవన్ కుమార్ ఉన్నారు.

కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఉచిత వైద్య శిబిరంలో వైద్యం చేస్తున్న డాక్టర్లు

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో ప్రతి రెండు నెలలకోసారి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో బిపి, షుగర్, పక్షవాతం, మూర్ఛ ఇలాంటి జబ్బులకు వైద్యులు డాక్టర్ నాగభూషణరావు, డాక్టర్ భరత్, డాక్టర్ వినోద్, డాక్టర్ డాక్టర్ హనీఫ్ డాక్టర్ పూజిత రోగులను పరిశీలించి మందులను సూచించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో సుమారు రూ.3000 విలువచేసే రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.300 ఇస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు బి. రామాంజనేయులు, జెఎన్ .శేషయ్య ,ప్రసాద్ శర్మ, బసయ్య, రంగస్వామి, వెంకటేశ్వర్లు, ఎల్లాగౌడ్, హుస్సేనయ్య, దుర్గా సహాయ సహకారాలు అందించగా మెడికల్ రేప్ ఖలీల్ మందులను ఇచ్చే సహకరించారు. ప్రతి రెండు నెలలకోసారి కేంద్రం ద్వారా వైద్య సేవలు అందుకుంటున్న రోగులు డాక్టర్లకు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులకు అభినందనలు తెలిపారు.

ఈ మురుగుకాలువ ఎవరికోసం

- కాంట్రాక్టర్ల కోసమా? కమీషన్ల కోసమా?
-రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతున్నా పట్టని పాలకులు
-నేల విడిచి సాము చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల ఇండ్ల ముందు రోడ్లు, కాలువలు నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నేల విడిచి సాము చేస్తున్నట్లుగా ఉందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు విమర్శించారు. ప్రజలకు ఉపయోగలేని మురుగు కాలువలు నాసిరకం రోడ్లు నిర్మించి రూ. కోట్ల ప్రజాధనం వృథా చేస్తున్నారని పిపిఎస్ఎస్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు న్యాయవాది ఆర్.చంద్రశేఖర్, బి.ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు బి.గోరెంట్లప్ప విమర్శించారు. ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధిబృందం స్థానికులతో రిచ్‌మండ్ కాలనీ ప్రాంతంలో 60 అడుగులు 100 అడుగుల రోడ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు రోడ్డులో రిలయన్స్ గోడౌన్ నుండి రిచ్ మండ్ కాలనీ మీదుగా 2 కిలో మీటర్ల మేర నిర్మించిన భారీ మురుగు కాలువ నిరూపయోగంగా మారిందన్నారు. 8 అడుగుల లోతులో భారీ మురుగు కాలువ, 100 అడుగుల విస్తీర్ణంలోని మెటల్ రోడ్డు ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదన్నారు. ఈ నిర్మాణాలు కాంట్రాక్టర్ కోసమా? కమీషన్ల కక్కుర్తి పడే వారి కోసమా? అని ప్రశ్నించారు. 2 కిలోమీటర్ల మేర నిర్మించిన కాలువ నిరుపయోగంగా మారిందన్నారు. మెటల్ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి దుమ్ము ధూళితో ప్రజలు నరకం అనుభవిస్తున్నా.. వైసిపికి చెందిన పాలకవర్గం పట్టించుకోకపోవడం. అప్పటి ప్రతిపక్షం, ఇప్పటి అధికార పక్షం స్పందించనందున ప్రజాధనం వృథాగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతినగర్ కాలనీలో మురుగు కాలువల కోసం రూ.60 లక్షల 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా.. అధికారులు స్పందించడం లేదన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన స్థానికులను కొందరు ఇంజనీర్లు బెదిరిస్తున్నారని తెలిపారు. నేల విడిచి సాము చేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్న నగరపాలక సంస్థ అధికారులపై తగిన చర్యలు తీసుకొని ప్రజాధనం వృథా కాకుండా.. ప్రజలకు ఉపయోగపడేలా రోడ్లు కాలువలు నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో పిపిఎస్ఎస్ నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, ఎండి యూనుస్, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ఎన్ పీటర్, టి.సూరిబాబు, సోమశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిచ్‌మండ్ కాలనీలో మురుగు కాలువను పరిశీలిస్తున్న పిపిఎస్ నాయకులు

నేడు రాజగోపాల్ సంస్మరణ సభ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : సిపిఎం సీనియర్ నాయకులు ,మాజీ కార్పొరేటర్ కె.రాజగోపాల్ సంస్మరణసభను సోమవారం, హరికిషన్ సింగ్‌సూర్జిత్ భవన్‌లో నిర్వహిస్తున్నామని సిపిఎం నగర కార్యదర్శి, ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి. షరీఫ్ తెలిపారు. సిపిఎం, సిఐటియు ,ప్రజాతంత్ర ఉద్యమాలలో రాటు తేలిన నాయకుడని ,అనునిత్యం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ,కార్మిక, కర్షక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. చివరి శ్వాస వరకు ఆయన కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడన్నారు. అటువంటి మహా నాయకుడు ఇటీవల కాలంలో మరణించారని, ఆయనను స్మరిస్తూ, సిపిఎం నాయకత్వంలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ,పేపర్ మిల్ కార్మిక సోదరులు, అలాగే సి ఐ టి యు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు హాజరు కావాలని, మరిముఖ్యంగా రాజగోపాల్ అభిమానులు ,పార్టీ సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి

మానవత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మానవతా సంస్థ సేవలు అభినందనీయమని డిఎస్‌పిలు షఫీవుద్దీన్ ,మహబూబ్‌బాష అన్నారు. ఆదివారం వెంకటరమణ కాలనీలోని మానవతా సంస్థ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రోగ్రామ్ కమిటీ చెర్మన్ గోనూరు యుగంధర్ శెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎస్‌పిలు, షఫీవుద్దీన్, మహబూబ్‌బాష మాట్లాడారు. మొక్కలు పెంపకం, రక్తదాన శిబిరాలు, 'ఐ' డొనేషన్ సేకరించుట ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఇవన్నీ కూడా నేటి సమాజానికి ఎంతో అవసరమైనవన్నారు. జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపును ని మాంటిస్సోరి స్కూల్ ఎ క్యాంపు ఆవరణంలో విశ్వ భారతి హాస్పిటల్ వారి సౌజన్యంతో మార్చి 2న ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, డాక్టర్ ఎం.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జర జాగ్రత్త...

ప్రజాశక్తి-పత్తికొండ

రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు జర జాగ్రత్తలు తీసుకోవాలని ఎండి జనరల్ మెడిసిన్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆది నాగేష్ అన్నారు. ఆదివారం ప్రజాశక్తితో డాక్టర్ ఆదినగేష్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే ,జూన్ మాసాలలో ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువ అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుండి బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని, మజ్జిగ, నిమ్మరసం తరచుగా తీసుకోవాలని అన్నారు. ఎవరైనా బయటికి వెళ్లేటప్పుడు తేలికపాటి దుస్తులు, కాటన్ దుస్తులు, తెల్ల దుస్తులు ధరించి, వాటర్ బాటిల్‌ను తీసుకొని వెళ్లాలన్నారు. పనిచేసుకునే ప్రదేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర పనులు చేసుకునే ప్రజలు టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని అన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వాహకులు రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నిరుద్యోగులను మోసగించిన కూటమి ప్రభుత్వం

-నిరుద్యోగులు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి
- ఖాకీ పెత్తనం చేస్తే ఖబర్దార్ : ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిరుద్యోగుల మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఖరిని ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పేర్కొన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులు రోస్టర్ విధానంలో తప్పులను సరిచేసిన తర్వాత పరీక్షలు నిర్వహించాలని మొదటినుంచి పోరాటం చేస్తూ వస్తున్నా గత మూడు రోజుల నుండి తీవ్రమైన ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారన్నారు. ఆందోళనలను నీరు గార్చడానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ప్రయత్నించారన్నారు. చివరి వరకు మాయమాటలు చెప్పి నమ్మించి నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వ వైఖరిని ఖండించారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచుతుందని నిరుద్యోగుల పైన ఖాకీ పెత్తనం చేయడానికి ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఈరోజు పరీక్ష అయినా సరే ఈ కూటమి ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని వారు హెచ్చరించారు. గ్రూప్ 2 అభ్యర్థులు రోస్టర్ పాయింట్ సరిచేయాలని తీవ్రమైన ఆందోళనలు చేసిన చివరి నిమిషం వరకు వారిని మభ్యపెట్టి ఎట్టకెళ్ళకి మోసం చేశారని అన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని మొదటి సంతకం పెట్టి ఎనిమిది నెలలైనా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయకుండా మోసం చేశారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసు పేరుతో కాలయాపన చేసి ఫిజికల్ ఈవెంట్స్ లో కూడా చాలా తప్పుడు తడకలుగా చేసి అభ్యర్థులు కోర్టుల చుట్టూ తిరిగేలాగా ప్రభుత్వ వైఖరి ఉందని తెలిపారు. అడుగడుగునా నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పి మాయ మాటలు చెప్పి మోసం చేయడం తప్ప ప్రభుత్వం న్యాయంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. ఉక్కు పాదంతో నిరుద్యోగులను అణచివేసి పరీక్ష నిర్వహించడం సరైంది కాదని, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు అందరూ శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, జిల్లాలకు వెళ్లి తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి అభ్యర్థులను ఓడించి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కెస్ లక్ష్మణరావు, డివి రాఘవులును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మాయ మాటలు చెప్పే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

తైక్వాండో క్రీడాకారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న నిర్వహకులు

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఓపెన్ పార్క్, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులను బొల్లెద్దుల శేషసాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో లాంటి మార్షల్ ఆర్ట్స్ వలన క్రమశిక్షణ, దేహ దారుఢ్యం వస్తుందన్నారు. క్రమం తప్పకుండా శిక్షణలో పాల్గొంటే తప్పకుండా విజయం సాధించవచ్చని చెప్పారు. నేటి సమాజంలో మహిళలకు మాస్టర్ ఆర్ట్స్ చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగన్న, బొల్లెద్దుల సాయి పవన్ కాంత్ బెల్టులు, బ్యాగ్ కిట్లు అందజేశారు. వినయ్ , హీరాలాల్, అజయ్, టి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

- ఎమ్మెల్యే బీవీ - అధికారులు, గ్రామ పెద్దలతో సమీక్ష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

మహా శివరాత్రి సందర్భంగా నందవరం మండలం గురుజాల శ్రీరామలింగేశ్వర స్వామి మహా క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి అధికారులకు, గ్రామ పెద్దలకు సూచించారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి వసతి, విద్యుత్, ప్రత్యేక బస్సులు, బస, పరిశుభ్రత, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. గుంతలు లేకుండా రోడ్లు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు చేయాలని తెలిపారు. హెల్త్ క్యాంపు పెట్టాలన్నారు. అనంతరం దేవాలయం నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు, ఎంపిడిఒ పుల్లయ్య, ఇఒఆర్‌డి సందీప్, ఇఒ రాంప్రసాద్, శివారెడ్డి, రాజేష్ రెడ్డి, రాయచోటి రామకృష్ణారెడ్డి, మాచాపురం ఖాసీం వలీ, నందవరం చిన్న రాముడు, ఆదిశేషులు, గురజాల గ్రామానికి చెందిన మల్లికార్జున, సంజన, శివ, వెంకటరాముడు, జయరాముడు, కర్ణ, నరసన్న, హనుమంతు, దేవరాజు, ఛార్లెస్ పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి ఏది..?

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి

మాట్లాడుతున్న నవీన్ పాటి

ప్రజాశక్తి - ఆదోని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి అమలు చేయడం లేదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి విమర్శించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 1, 2023 నుంచి రావాల్సిన 12వ పిఆర్‌సి జాడ లేదన్నారు. గత ప్రభుత్వం 11వ పిఆర్‌సిలో 23 శాతం ఫిట్‌మెంట్ మాత్రమే ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం 12వ పిఆర్‌సికి సంబంధించి ఒక్క మాటైనా మాట్లాకపోవడం సరికాదన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి పిఆర్‌సి కమిషన్ వేసి ద్రవ్యోల్బణం ఆధారంగా ఉద్యోగుల వేతనాలను స్థిరీకరించడం ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించాలని, రిపోర్టు వచ్చేలోపు ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన సుమారు రూ.25 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడి పట్ల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.జీవిత మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, వై.రామాంజనేయులు, జిల్లా అకాడమిక్ కన్వీనర్ నరసయ్య గౌడ్, కౌతాళం మండల ప్రధాన కార్యదర్శి ఓంకార్, నాయకులు నాగలక్ష్మి, జి.కల్యాణి, విజయలక్ష్మి, వై.నారాయణ, జి.జనార్ధన, ఎల్‌కె.బసప్ప, శివ కుమార్ గౌడ్, సిద్ధప్ప, రంగన్న, నాగేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కౌతాళం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

మండలంలోని మదిర గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కోసిగి కిష్టప్పపై గోడ కూలి మృతి చెందడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్థిక సహాయం అందించినట్లు మదిర గ్రామం వైసిపి నాయకులు రామయ్య, పాలక్ష్మి, వెంకటేష్ తెలిపారు. ఆదివారం కిష్టప్ప కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని బాలనాగిరెడ్డి, ప్రదీప్ రెడ్డి సహకారంతో అందజేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈఏడాది పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల పాలైన ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని భార్య దేవమ్మ, ఇద్దరు పిల్లలు కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడం బాధాకరమన్నారు.

ఆ దారిలో ప్రయాణం... అంత వీజీ కాదు..!

- ఏరూరు రహదారిలో అడుగడుగునా తేలిన కంకర
- వాహనాలు నడపాలంటే ఇబ్బందే..!
- ఆటోలోనే ప్రసవించిన ఇద్దరు మహిళలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మారుమూల ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వానంగా మారాయి. ఈ రోడ్లలో ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఆ రహదారిలో ప్రయాణం అంత వీజీ కాదంటూ ప్రజలు బెంబేలెత్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారులను బాగు చేసేందుకు రూ.కోట్ల నిధులను వెచ్చిస్తున్నాయి. కానీ రహదారులు మాత్రం బాగు కావడం లేదు...

కంకర తేలి గుంతలు పడి ఉన్న ఏరూరు రహదారి

సంక్రాంతి పండగలోపు ఏ రోడ్డు కూడా గుంతలు లేకుండా చూసుకుంటామని కూటమి ప్రభుత్వం పదేపదే నొక్కి చెప్పింది. మండలంలోని ఏరూరు రహదారికి మాత్రం మోక్షం లభించడం లేదు. చిప్పగిరి నుంచి డేగులపాడు వరకు దాదాపు 16 కిలోమీటర్లు ప్రయాణించాలంటే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమేనని ఈ గ్రామాల ప్రజల వాపోతున్నారు. నెలలోపు డేగులపాడు నుంచి ఆటోలో తీసుకొస్తున్న గర్భిణీ మహిళ ఏరూరు గ్రామం దగ్గరకు వచ్చే సరికి ఆటో ఊపుడికి అక్కడినే ప్రసవించారని డేగులపాడు ఆటో డ్రైవర్ ఆంజనేయులు తెలిపారు. ఇలాంటి సంఘటనలే నెలలోపు రెండు జరిగాయని తెలిపారు. ద్విచక్ర వాహనంలో వెళ్లినా కంకర తేలిన గుంతలను తప్పించడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కడుపునొప్పి వచ్చేలా ఉంటుందని పలు వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇద్దరు అధికారులు స్కూటీపై వెళ్తూ అదుపు తప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. వారు బయటకు చెప్పుకోలేక పోయారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. నిత్యం మిరప పొలాల్లో పనులు చేసుకోవడానికి పలు గ్రామాల నుంచి ఆటోల్లో వస్తున్న కూలీలు పరిస్థితి ఇబ్బందిగా ఉంది. కూలీలు వెళ్లే ఆటోలు ప్రమాదాలకు గురయి మృతి చెందిన సంఘటనలూ ఉన్నాయి. ఆర్అండ్‌బి అధికారులకు అవి కనిపించడం లేదు. రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పూర్వకాలం నుంచి కూడా చిప్పగిరి నుంచి ఏరూరు, డేగులపాడు, కమ్మరిచేడు గ్రామాల మీదుగా బళ్లారికి తక్కువ సమయంలో ప్రయాణం చేరుకోవడానికి వెసలుబాటు ఉండేదని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం, ఇన్‌ఛార్జీ చొరవ తీసుకొని రహదారి సమస్యను పరిష్కరించాలని, ఉమ్మడి జిల్లాల మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డిని కలిసి సమస్యను వివరించి నిధులు మంజూరు చేయించాలని ఏరూరు, డేగులపాడు ప్రజలు కోరుతున్నారు.

గర్భిణుల ఆవేదన చూడలేకపోతున్నాం

- ఆంజనేయులు, ఆటో డ్రైవర్, డేగులపాడు

డేగులపాడు, ఏరూరు గ్రామం నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు, ఆస్పత్రికి వెళ్లేవారు చిప్పగిరికి, గుంతకల్లుకు ప్రయాణం చేయాల్సి ఉంది. ఈ రహదారిలో ప్రయాణం అంటే అందరికీ భయమేస్తుంది. డేగులపాడుకు చెందిన గర్భిణీని నా ఆటోలో ఎక్కించుకొని ఆస్పత్రికి బయల్దేరాను. ఏరూరు గ్రామం దాటాక ఆ కంకర తేలిన గుంతల్లో ఆటో వెళ్తున్నప్పుడు అక్కడ ఇక్కడ ఊగడంతో మధ్యలోనే గర్భిణీ ప్రసవించారు. అదృష్టం బాగుండి కాన్పు బాగా అయ్యారు. ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరారు.

రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో నూతనంగా ప్రతిష్టించిన విజయ గణపతి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఈర్లదిన్నె హసీని వారు శ్రీస్వామి వారి డొనేషన్ ఆఫీసులో రూ.1,00,100 విరాళం చెల్లించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు శ్రీస్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలిచ్చి, బాండు పేపర్, పూలమాలతో సన్మానించారు. శివన్న స్వామి పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దాతలు

డ్రైవర్ నిర్లక్ష్యం

- విద్యార్థి బలి

ప్రజాశక్తి - ఆదోని

అతివేగం.. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం బలైంది. పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు శ్రీకృష్ణ దేవాలయం ముందు ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆదిత్య నారాయణ (10) ఐదో తరగతి విద్యార్థి మృతి చెందారు. పట్టణంలోని లంగర్ బావి స్ట్రీట్‌కు చెందిన గురురాజా, ప్రతిభ దంపతులకు ఇద్దరు సంతానం. చిన్న కుమారుడు ఆదిత్య నారాయణ పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నారు. మంగళవారం స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో డ్యాన్స్ ప్రాక్టీస్ కోసం తండ్రి గురురాజా బైక్‌పై ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. ఎమ్మిగనూరు టర్నింగ్ దాటి శ్రీకృష్ణ దేవాలయం సమీపంలోకి రాగానే ఎమ్మిగనూరు వైపు నుంచి అతివేగంగా లారీ దూసుకొచ్చింది. వేగంగా వస్తున్న లారీని చూసి గురురాజా బ్రేక్ వేశారు. అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. వేగంగా వస్తున్న లారీ ఆదిత్య నారాయణపై దూసుకెళ్లింది. అటు వైపు పడిన గురురాజా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్ర గాయాలు పాలైన ఆదిత్య నారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. వేగంగా దూసుకొచ్చిన లారీడ్రైవర్ వాహనంతో పాటు పరారయ్యాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. కుమారుడు కళ్లెదుటే మృతి చెందడంతో గురురాజా గుండెలు బాదుకుంటూ రోధించిన తీరు కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న తల్లి ప్రతిభ ఆదిత్య నారాయణ మృతదేహాన్ని చూసి కుప్పకూలిపోయారు. 'ఎవరి కోసం బతకాలి' అంటూ, 'ఎంత అన్యాయం జరిగింది' అంటూ ఆమె ఏడ్చిన తీరు చూసి అందరూ చలించిపోయారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్య నారాయణ (ఫైల్)

జోరుగా కర్ణాటక మద్యం అమ్మకాలు

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ పోలీసులు - అర్ధరాత్రి గ్రామాలకు కర్ణాటక మద్యం సరఫరా
- వాడవాడలా కర్ణాటక టెట్రా ప్యాకెట్లు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణపై ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో కర్ణాటక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆస్పరిలో ఒక మద్యం దుకాణం ఉండేది. కూటమి ప్రభుత్వంలో గౌడ్ కులస్తులకు కేటాయిస్తున్న మద్యం దుకాణంతో కలిపి ఆస్పరిలో మద్యం దుకాణాలు మూడుకు చేరుకున్నాయి. గత ప్రభుత్వంలో ఉన్న మద్యం ధరలతో పోలిస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మద్యం ధరలకు తేడా లేకపోవడంతో కర్ణాటక మద్యానికి భారీగా డిమాండ్ ఉంది.

ప్రతి గ్రామంలోనూ కర్ణాటక మద్యం

మండలంలోని జొహరాపురం, ఆస్పరి, చిన్నహోతూరు, చిగిలి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, తోగలగల్లు, తుర్వగల్లు, బైలు పత్తికొండ, ములుగుందం, బనవనూరు, కారుమంచి, కైరుప్పల, దోదగొండ, హాలిగేరా, బిల్లేకల్లు, ముత్తుకూరుతో పాటు ఆయా గ్రామాల్లోని వాడవాడలా కర్ణాటక మద్యం బెల్ట్ షాపులు జోరుగా నడుస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ పోలీసులకు ముడుపులు ముట్టడంతో గ్రామాల్లో విచ్చల విడిగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యాన్ని అరికట్టాల్సిన అధికారులే మమూలుకు పాల్పడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అర్ధరాత్రి 11 నుంచి 2 గంట మధ్యలో బొలేరో, ద్విచక్ర వాహనాలపై వచ్చి టెట్రా కేసు ఇచ్చి వెళ్తున్నారని సమాచారం. కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లు 90 మిల్లీలీటర్లు ఒకటి రూ.40 చొప్పున ఒక్క కేసులో 96 ప్యాకెట్లు ఉంటాయి. ఒక కేసు రూ.3,840కు విక్రయిస్తారు. గ్రామంలో బెల్ట్ షాపులో ఒక టెట్రా ప్యాకెట్‌ను నిర్వాహకులు రూ.80లకు కొనుకుంటున్నారు. కొంతమంది బెల్ట్ షాపు ఓనర్లు గ్రామాల్లో 10 నుంచి 20 కేసుల వరకు నిల్వ ఉంచుకొని పెళ్లిళ్లు, దేవర, జాతరలకు టెట్రా కేసు రూ.5,500 నుంచి రూ.7,500 వరకు అమ్ముతున్నారు. ఒక కేసు మీద రూ.3,840 లాభం వస్తుంది. గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అధికార యంత్రాంగం చేతల్లో అమలు చేయడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్‌షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తంగరడోణ సచివాలయం ముందు పడేసిన కర్ణాటక టెట్రా ప్యాకెట్లు

25 నుంచి ఇంటర్వ్యూలు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 25 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈనెల 25న 1వ వార్డు నుంచి 10వ వార్డు లబ్ధిదారులకు ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, 11 నుంచి 20వ వార్డు లబ్ధిదారులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న 21వ వార్డు నుంచి 31వ వార్డు లబ్ధిదారులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 32 నుంచి 42వ వార్డు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 19 బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూకు వస్తారన్నారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ దరఖాస్తు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్, విద్యార్హత పత్రాలు ఒరిజినల్‌తో పాటు ఓ సెట్టు జిరాక్స్ కాపీలను ఇంటర్వ్యూకు తీసుకురావాలని తెలిపారు. నెలకొల్పే యూనిట్ గురించి అనుభవం, అర్హత ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని చెప్పారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు

- ప్రిన్సిపల్ రాఘవ రావు

ప్రజాశక్తి -ఆలూరు

ఎపి మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించి, 27న మెరిట్ లిస్ట్, 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

సిద్ధమవుతున్న మసీదులు

ప్రజాశక్తి - హోళగుంద

వచ్చేనెల 1 లేదా 2న ప్రారంభం కానున్న రంజాన్ నెల కఠోర ఉపవాస దీక్షలకు అహలె హదీస్ మసీదులు, అహలేశున్నతుల్ జమాత్ మసీద్, తబ్లిక్ మసీద్, రాజా నగర్‌లోని మసీదులను ముస్లిం కమిటీ, ముతావల్లీలు ముస్తాబు చేస్తున్నారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షలతో పాటు ఐదు పూటల నమాజు, రాత్రి వేళలో ప్రత్యేకంగా చేసే తరారీ నమాజు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ముతావల్లీలు కొలిమి వాహిద్, ముల్లావలి, ముల్లా షబ్బీర్, శాలి ఫక్రుద్దీన్, డాక్టర్ ఖాసీం, పింజారు సనావుల్లా, ముల్లా అల్లా బకాష్ ఆదివారం తెలిపారు. ప్రార్థన కోసం వచ్చే ముస్లింలు, మహిళలు, బాల బాలికలు, కఠోర ఉపవాస దీక్షల కోసం మసీదులో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మురుగుదొడ్లు, మూత్రశాలల సదుపాయం కల్పించడానికి అన్ని చర్యలూ తీసుకున్నామని చెప్పారు. మసీదులను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సంబంధిత అధికారులు రంజాన్ నెలలో తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత లోపించకుండా చూడాలని టిడిపి నాయకులు అబ్దుల్ సుభాన్, డిఎస్.బాషా, మోయిన్, బడే గర్ అబ్దుల్లా, ముల్లావలి కోరారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి కోలుకోలేక మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కౌతాళం గ్రామానికి చెందిన సురేష్ (32) గత సోమవారం శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం కోసం వెళ్తుండగా ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కన్నీరు మున్నీరయ్యారు.

సేవకు మారుపేరు.. సంత్ గాడ్గే బాబా

ప్రజాశక్తి - హోళగుంద

సంత్ గాడ్గే బాబా సేవకు మారుపేరని రజక సంఘం పెద్దలు తెలిపారు. ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కురుకుంద నాగరాజు, మంగయ్య, లక్ష్మణ, మల్లికార్జున మాట్లాడారు. సంత్ గాడ్గే బాబా పేదలకు నాణ్యమైన విద్య, రోగులకు వైద్యం, నివాసం, జంతువులకు రక్షణ కల్పించిన మానవతావాది అని తెలిపారు. నాగరాజు, బసవ, మల్లికార్జున, రమేష్, హనుమేష్, నాగేంద్ర, కృష్ణ, రాజశేఖర్, చంద్ర, గాదిలింగ, వీరేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బీడి బంకు దగ్ధం

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఎల్లార్తి గ్రామంలో విద్యుదాఘాతంతో బీడి బంకు దగ్ధమైంది. బోయ కామాక్షమ్మ, భర్త బోయ మల్లయ్య నిర్వహిస్తున్న బీడి బంకు విద్యుదాఘాతంతో దగ్ధం కావడంతో బంకులో ఉన్న దాదాపు రూ.50 వేల సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. బంకు కాలిపోవడంతో బాధితుడు కన్నీటిపర్యంతమయ్యారు.

రమణీయం.. బండే గురువుల రథోత్సవం

జనసంద్రంలో సాగిన రథోత్సవం

ప్రజాశక్తి - నందవరం

పూలచింత గ్రామంలో వెలసిన సద్గురు బండే గురువుల రథోత్సవం ఆదివారం బండే గురుస్వామి ఆధ్వర్యంలో రమణీయంగా సాగింది. అర్చకులు మఠంలో స్వామివారికి ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు రథోత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు పల్లకి, నందికోలు సేవ చేశారు. సాయంత్రం 5 గంటలకు భక్తుల సందడి మధ్య రథోత్సవం కనులపండువగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఉదయం 10 గంటల నుంచి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు రాత్రి పడుకోవడానికి వసతులు కల్పించారు.

ప్రతేడాది ఘనంగా జాతర : బండే గురుస్వామి



పూలచింత గ్రామంలో వెలిసిన శ్రీసద్గురు బండే గురు స్వాముల జాతర వేడుకలను శ్రీబండేగురు మఠం 5వ పీఠాధిపతి శ్రీజయశంకర స్వాముల సంకల్పం మేరకు ప్రతేడాది ఘనంగా నిర్వహిస్తున్నట్లు బండే గురుస్వామి తెలిపారు. జాతర వేడుకలకు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీగా తరలి వస్తారని చెప్పారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

- సిఎస్ఐ చర్చి పాస్టర్ విలియం సుజిత్

ప్రజాశక్తి - ఆదోని

సర్టిఫికెట్లు ఇస్తున్న సభ్యులు

ప్రతి ఒక్కరూ సామాజిక సేవ అలవర్చుకోవాలని సిఎస్ఐ చర్చి పాస్టర్ విలియం సుజిత్, సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్ తెలిపారు. సిఎస్ఐ డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజక్ వరప్రసాద్ నాలుగో కాన్సిగ్రేషన్ డే సందర్భంగా సిఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంక్ స్వచ్ఛంద సేవాసంస్థ సహకారంతో రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీల్ రాజ్‌కుమార్ మాట్లాడారు. రక్తం ఇవ్వడం వల్ల ఇంకొకరి ప్రాణం కాపాడిన వారమవుతామని, ప్రతి మూడు నెలలకోసారి రక్తం ఇవ్వడం మంచిదేనని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం కూడా ఉంటారని చెప్పారు. దాదాపు 30 మంది రక్తదానం చేశారు. వంద మందికి బీపీ, షుగర్, ఇతర పరీక్షలు చేశారు. రక్తదాన శిబిరంలో రక్తాన్ని ఇచ్చిన వారికి సిఎస్ఐ క్రైస్ట్ చర్చి పాస్టర్ విలియం సుజిత్, సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్ చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సంఘ పెద్దలు ఎజె.ప్రసాద్, అమృత్, సౌజన్య కుమారి, యూత్ సునీల్, కార్తీక్, అశోక్, మైలర్, ఆనంద్, సాగర్, మెడికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సౌజన్య, అనిత ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ, సుంకలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తురవగల్లు గ్రామంలో పెద్దమ్మ, సుంకలమ్మ అవ్వల నూతన విగ్రహ ప్రతిష్టపాన ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూల నక్షత్ర యుక్త మకర లగ్నంలో ఉదయం పెద్దమ్మ, సుకుంలమ్మ అవ్వ దేవత మూర్తులకు యంత్ర స్థాపనం, విగ్రహ ప్రతిష్టాపన, కలశాధివాసం, అభిషేకం, హోమం, బలిహరణం, గుమ్మడి కాయ బలి పూజ, పూర్ణాహుతి, లలిత హోమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా గ్రామంలో ఆడపిల్లలకు నూతన బట్టలు పెట్టి వడి బియ్యం పోసుకుని ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. విగ్రహాల ప్రతిష్టాపన నేపథ్యంలో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి, విశ్రాంత విఆర్ఒ సీతారామి రెడ్డి, నరసింహా రెడ్డి, పులికొండ రంగన్న పాల్గొన్నారు.

ప్రతిష్టాపనలో పాల్గొన్న నాయకులు

సబ్సిడీపై కన్ను..!

- రంగ ప్రవేశం చేసిన దళారులు

- రుణాల మంజూరులో పారదర్శకత ఉండేనా..?

ప్రజాశక్తి - ఆదోని

స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలందించి ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తామని ప్రభుత్వం ప్రక్రియ మొదలు పెట్టింది. సబ్సిడీ ఉండడం వల్ల తమ వారికి ఇవ్వాలని కొందరు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. దళారులు ప్రవేశించి రూ.30 వేల వరకు ఇవ్వాలని, రుణం ఇప్పిస్తామని ఆశ చూపుతున్నట్లు సమాచారం. యూనిట్ నెలకొల్పకుండా బ్యాంకు అధికారులతో మాట్లాడి సబ్సిడీ కాజేసే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయని తెలిసింది. విద్యార్హత, అనుభవం ప్రామాణికంగా తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రుణాల మంజూరులో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. రాజకీయ నాయకుల జోక్యం ఉంటుందని అర్హులకు మొండి చేయి చూపే అవకాశం లేకపోలేదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు ప్రక్రియ మొదలు కావడంతో ఆదోని పట్టణంలో దరఖాస్తులు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు. కేవలం 98 యూనిట్లకు 2,300 మంది బీసీ, ఓసీ యువత స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీసీ'ఎ' 34, బీసీ 'బి' 20, బీసీ 'డి' 10, బీసీ 'ఈ' 16, ఈబీసీ 7, రెడ్డి 5, కమ్మ 2, వైశ్యాస్ 4 యూనిట్ల చొప్పున యూనిట్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మూడు విభాగాలుగా రుణాల మంజూరుకు అధికారులు రూపకల్పన చేశారు. యూనిట్ రూ.2 లక్షలకు రూ.75 వేలు, రూ.3 లక్షలకు రూ.1.25 లక్షలు, రూ.5 లక్షలకు రూ.2 లక్షల చొప్పున ఆయా కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీ ఇస్తారు. చాలామంది స్వయం ఉపాధి పథకాల వైపు మొగ్గు చూపారు. ఎలాగైనా రుణం దక్కించుకోవాలని ఎవరి ప్రయత్నాలు వారు ఇప్పటికే మొదలుపెట్టారు. అర్హులకు రుణం అందించి ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందించాలని పలువురు కోరుతున్నారు. ఈనెల 25న మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అర్హులకే అందిస్తాం

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్

స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాం. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు దారులు సమర్పించిన వివరాలను ఇప్పటికే బ్యాంకు అధికారులకు అందించాం. వారు నెలకొల్పే యూనిట్, రుణం చెల్లించే విధానం గురించి బ్యాంకు అధికారులను మెప్పించాలి. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లు ప్రాజెక్టు నివేదికలు తీసుకురావాలి. ప్రతిభ ఆధారంగా రుణం మంజూరయ్యేలా చూస్తాం. ఇందులో దళారుల ప్రమేయం లేకుండా చూస్తాం. అపోహలు వీడి ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

రైతులను ఆదుకోవాలి

-వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఏటా సీజన్‌కు ముందే పెట్టుబడి సహాయంగా రూ.13,500 అందజేసి రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. విత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులకు అప్పులు చేసి రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని రైతులకు ఆశ చూపారన్నారు. సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నాటడం నుంచి పంటలు అమ్ముకొనే అంతవరకు భరోసా ఇచ్చిన, ధరల స్థిరీకరణ నిధి రూ.3 వేల కోట్లు ఏర్పాటు చేసి రైతులు నష్ట పోకుండా ఆదుకున్నారని తెలిపారు. రైతులకు పెట్టుబడి సహాయం అందించాలని కోరారు. వైసిపి జిల్లా కార్యదర్శి అలారుదిన్నె ప్రభాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, శేషాద్రి రెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలి

- ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే బిల్లును ఎమ్మెల్యేలు ఆమోదించాలని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న కోరారు. ఆదివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకులు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, రాయలసీమ ప్రాంతంలో మరీ దారుణంగా ఉందని తెలిపారు. దీనికి ఏకైక మార్గం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించడమేనని చెప్పారు. ఈ విషయంపై గత 40 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని ప్రాంతీయ విభేదాన్ని తొలగించి, రాష్ట్రంలో ఉన్న వాల్మీకులందరినీ ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో ఆమోదిస్తూ కేంద్రానికి పంపాలని కోరారు. గతంలో రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి పంపిన వాల్మీకి ఎస్టీ బిల్లు కేంద్రం వద్ద ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కూటమి ప్రభుత్వంలో ఉండడం కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానితో ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి ఉన్న సంబంధాల కారణంగా బోయల ఎస్టీ బిల్లు గురించి చర్చించి కేంద్రం ఆమోదించే విధంగా ప్రత్యేక కృషి చేయాలని కోరారు. కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా, కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా వాల్మీకులకు గుర్తింపు ఉందని, కర్ణాటక రాష్ట్రంలోనూ ఎస్టీలుగా గుర్తింపబడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీసీలుగా ఉంటూ అనేక విధాలుగా నష్టపోతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వాల్మీకుల స్థితిగతులు తెలుసని, న్యాయం చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.